క్లుప్తంగా

నేడు 'డయల్ యువర్ డీఎం'

ఇబ్రహీంపట్నం: ఆర్టీసీలో నెలకొన్న సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ అశోక్‌రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని, ఆర్టీసీ సమస్యలను సెల్ నంబర్ 9959226141కు ఫోన్ చేసి తెలపాలన్నారు.

దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు

రోడ్లు భవనాల శాఖ ఏఈ శ్రీహరి



మంతన్‌గౌరెల్లి - మాల్ మార్గంలో గుంతలు పడిన రోడ్డును పరిశీలిస్తున్న శ్రీహరి

యాచారం: మండలంలో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయనున్నట్లు రోడ్లు భవనాల శాఖ ఏఈ శ్రీహరి తెలిపారు. గురువారం ఆయన మండలంలోని మంతన్‌గౌరెల్లి - మాల్ గ్రామాల మధ్య గుంతలు పడిన రోడ్డును పరిశీలించారు. త్వరలో టెండర్లు పిలిచి ఈ రోడ్డుకు మరమ్మతులు చేపడతామని తెలిపారు. గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు ఏఈ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో మంతన్‌గౌరెల్లి ఎంపీటీసీ కే జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులు పునఃప్రారంభం



పైప్‌లైన్ నిర్మాణం కోసం కాలువ తీస్తున్న సిబ్బంది

హయత్‌నగర్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ పరిధిలోని 3వ వార్డు కళానగర్‌లో మంచినీటి పైపులైను పనులు తిరిగి ప్రారంభించినట్లు స్థానిక కౌన్సిలర్ ఎం మణెమ్మ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. మిషన్ భగీరథ పథకంలో భాగంగా గత ఏడాది కాలనీలో మంచినీటి పైపులైన్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఆ సమయంలో భారీ వర్షాలు పడడంతో పనులను నిలిపేసినట్లు వివరించారు. ప్రస్తుతం కాలనీలో వరద నీరు తగ్గడంతో పైపులైన్ పనులు తిరిగి ప్రారంభించినట్లు తెలిపారు. వర్షాలు ప్రారంభమయ్యే లోపు పనులను పూర్తి చేసి కాలనీ వాసులకు మంచి నీరు అందిస్తామని ఆమె పేర్కొన్నారు.

తాలు లేకుండా ధాన్యం తేవాలి



కొనుగోలు కేంద్రంలో నిల్వ చేసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఓ రాజు తదితరులు

తలకొండపల్లి: మండలంలోని చుక్కాపూర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏవో రాజు, ఏఈఓ శ్రీనాథ్ గురువారం సందర్శించారు. కొనుగోలు కేంద్రానికి రైతులు తెచ్చిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగ ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. తేమ 17శాతం కంటే తక్కువగా ఉండేలా చూసుకోవాలన్నారు. అలాగే తాలు, చెత్త, మట్టి, లేకుండా నాణ్యమైన పంటను కొనుగోలు కేంద్రాలకు తెచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం



బొడ్రాయి ప్రతిష్ఠాపనలో జెడ్పీటీసీ నిత్య దంపతులు

మంచాల: మండలంలోని లోయపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేష్, జెడ్పీటీసీ మర్రి నిత్యరెడ్డి దంపతులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు దండెం రాంరెడ్డి, చిలుక మధుసూదన్‌రెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, రాష్ట్ర నాయకుడు ఈసీ శేఖర్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్, యువజన విభాగం మండల అధ్యక్షుడు భద్రినాథ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కంకర పరిచి.. బీటీ మరిచి..

- అసంపూర్తిగా రావిచేడ్ - మద్దెలకుంట తండా రోడ్డు పనులు
- ప్రమాదాల బారిన వాహనచోదకులు
- ఇబ్బందుల్లో తండా వాసులు
- చోద్యం చూస్తున్న అధికారులు



కంకర వేసి వదిలేసిన రావిచేడ్ - మద్దెలకుంట తండా రోడ్డు

కడ్తాల్: మండలంలోని రావిచేడ్ - మద్దెలకుంట తండా రహదారి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కంకర పరిచి ఆరు నెలలు దాటినా బీటీ వేయకపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎస్‌డీఎఫ్ కింద రెండున్నరేళ్ల క్రితం ఈ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం 2.20కోట్లు మంజూరు చేసింది. ఏడాది క్రితం పనులు ప్రారంభమయ్యాయి. తొలుత కల్వర్టుల నిర్మాణం పూర్తి చేశారు. ఆ తర్వాత కంకర వేసి వదిలేయడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మట్టి రోడ్డు ఉన్నా ఇబ్బందులు పడే వాళ్లం కాదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

పలుమార్లు ఆందోళనలు

అసంపూర్తిగా ఉన్న రావిచేడ్ – మద్దెలకుంట తండా రోడ్డును పూర్తి చేయాలంటూ తండా వాసులు అనేక సార్లు ఆందోళనలు చేపట్టారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేశారు. అదిగో పూర్తి చేస్తాం.. ఇదిగో పూర్తి చేస్తామని హామీలు ఇచ్చారే తప్ప పనులు పూర్తి చేయలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే బస్సు సౌకర్యం తోపాటు, మండల కేంద్రం కడ్తాల్‌తో పాటు, హైదరాబాద్‌కు రాకపోకలు సాగించేందుకు ఇక్కట్లు తొలగుతాయని తండా వాసులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డు పనులు సత్వరం పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

బైక్‌పై వెళ్లాలంటే భయం



రావిచేడ్ - మద్దెలకుంట మార్గంలో కంకర వేసి వదిలేయడంతో రాకపోకలు సాగించాలంటే భయమేస్తోంది. కంకర కారణంగా తరచూ ప్రమాదాల బారిన పడుతున్నాం. త్వరితగతిన రోడ్డు పనులు పూర్తి చేయాలి.

– శ్రీనునాయక్, మద్దెలకుంట తండా

చర్యలు తీసుకోండి



నత్తనడకన సాగుతున్న రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలి. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే కడ్తాల్ తోపాటు హైదరాబాద్‌కు రాకపోకలు సాగించడానికి ఎంతో సులువుగా ఉంటుంది. ప్రజల రవాణా కష్టాలను దృష్టిలో పెట్టుకొని వెంటనే పనులు పూర్తి చేయాలి.

– జవర్య నాయక్, మద్దెలకుంట తండా

రోడ్డు పనులు పూర్తి చేస్తాం



పదిహేను రోజుల్లో రావిచేడ్ – మద్దెలకుంట రోడ్డు పనులు పూర్తి చేస్తాం. ఇప్పటికే సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడాం. వెంటనే పనులు పూర్తి చేయాలని ఆదేశించాం. పనులు జాప్యం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. అతి త్వరలో ప్రజలకు రవాణా కష్టాలు ఉండవు.

– పరమేష్, పీఆర్‌ఏఈ, కడ్తాల్

మంచిరెడ్డికి ఎర్రబెల్లి పరామర్శ



పద్మమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ఎర్రబెల్లి తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాతృమూర్తి మరణం ఆ కుటుంబానికి తీరని లోటని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఇటీవల ఎమ్మెల్యే మాతృమూర్తి చనిపోయిన విషయం తెలుసుకున్న మంత్రి గురువారం మండలంలోని ఎల్మినేడు గ్రామానికి వచ్చి పద్మమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ఎమ్మెల్యేను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి, ఎంపీపీ కృపేష్, వైస్ ఎంపీపీ మంచిరెడ్డి వెంకట ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ ఏ అశోకవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు .

ప్రమాద బాధితులను ఆదుకోవాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తిని పరామర్శిస్తున్న భాస్కర్ తదితరులు

యాచారం: పనులకు వెళుతూ ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదానికి గురైన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కే భాస్కర్ డిమాండ్ చేశారు. ప్రమాదంలో గాయపడి నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని గురువారం ఆయన పరామర్శించారు. ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఔటర్ రింగ్ రోడ్డుపై మొక్కల పెంపకం చేపట్టే కార్మికులంతా పేదవారేనని అన్నారు. క్షతగాత్రులకు ప్రభుత్వం తక్షణ వైద్య ఖర్చుల నిమిత్తం రూ. లక్ష చొప్పున ఆర్థిక సాయం చేయాలని కోరారు. వారు పూర్తిగా కోలుకునే వారకు ఆరు నెలల పాటు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం యాచారం మండల కార్యదర్శి ఏ నర్సింహ, కొత్తపల్లి ఉప సర్పంచ్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి చేయూత

తలకొండపల్లి: మండలంలోని చంద్రధన గ్రామానికి చెందిన కుమ్మరి ఆంజనేయులు ఇటీవల ఇంటి నిర్మాణం చేపట్టాడు. అయితే ఆర్థిక ఇబ్బందులు కారణంగా పనులు ఆపేశాడు. ఉప సర్పంచ్ సుధాకర్ సహకారంతో జెడ్పీటీసీని కలిసి ఆర్థిక సహాయం చేయాలని కోరారు. స్పందించిన ఆయన ఉప్పల ట్రస్టు సభ్యులతో ఆంజనేయులు ఇంటి నిర్మాణానికి సిమెంట్, స్టీల్, ఇసుక తదితర సామగ్రిని గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుధాకర్, నాయకులు రాజేందర్‌రెడ్డి, బచ్చయ్యగౌడ్, గిరి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'పీపుల్స్ మార్చ్'కు కాంగ్రెస్ శ్రేణులు



పీపుల్స్ మార్చ్ సభకు వెళుతున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా గురువారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో నిర్వహించిన బహిరంగ సభకు మండల కేంద్రం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. అంతకుముందు పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలు వాహనాలలో జడ్చర్ల తరలివెళ్లారు. జడ్చర్లకు వెళ్లిన వారిలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కృష్ణ, భీమా, బలరాం, దశరథ్, రమేశ్, రాజు ఉన్నారు.

ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న విఠల్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలోని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం సభ్యుడు.. అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామానికి చెందిన మహ్మద్ మున్నా ఏప్రిల్ 15న మృతి చెందారు. సహకార సంఘం ద్వారా మృతుడి భార్య ఫాతిమా బేగంకు రూ. 25వేల ఆర్థిక సహాయాన్ని గురువారం సంఘం చైర్మన్ విఠల్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సత్యానారాయణ, యాదిరెడ్డి, మేనేజర్ ఐలేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాలకు స్థల గ్రహణం



చర్లపటేల్‌గూడలో అందుబాటులోకి వచ్చిన క్రీడా ప్రాంగణం

- మూడు గ్రామాల్లో నిలిచిపోయిన పనులు
- ఏడాదిగా ఎదురు చూపులు
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం
- స్థల దాతల కోసం ఎదురుచూపులు

ఇబ్రహీంపట్నం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పంచాయతీ కేంద్రాల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఇబ్రహీంపట్నం మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. అయితే మూడు గ్రామాల్లో భూ సమస్యల కారణంగా పనులు ఆగిపోయాయి.

మూడు గ్రామాల్లో భూమి కరువు

మండలంలో 14 గ్రామ పంచాయతీలు ఉండగా నాలుగు గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు పూర్తయ్యాయి. మరో ఏడు చోట్ల నిర్మాణ దశలో ఉన్నాయి. తుర్కగూడ, కర్ణంగూడ, కప్పపహాడ్ గ్రామాల్లో ప్రభుత్వ భూమి లేక పనులు మొదలు కాలేదు. ఒక్కో క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు ఎకరా భూమి కావాల్సి ఉంటుంది. స్థలం సమకూరితే ప్రభుత్వం రూ. 5లక్షలు మంజూరు చేస్తుంది. ఈ నిధులతో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, హైజంప్, లాంగ్ జంప్ కోర్టులతోపాటు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే కప్పపహాడ్, తుర్కగూడ, కర్ణంగూడ గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు అవసరమైన భూమి లేకపోవడంతో అధికారులు దాతల కోసం ఎదురు చూస్తున్నారు.

మూడు గ్రామాల్లో భూ సమస్య



మండలంలోని 11 గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలకు భూమి సమకూరింది. నాలుగు గ్రామాల్లో క్రీడా మైదానాలు అందుబాటులోకి వచ్చాయి. మరో 7 గ్రామాల్లో పనులు చివరి దశకు వచ్చాయి. తుర్కగూడ, కర్ణంగూడ, కప్పపహాడ్ గ్రామాల్లో భూ సమస్య కారణంగా క్రీడా ప్రాంగణాల పనులను చేపట్టలేక పోయాం. రెవెన్యు అధికారులను భూమి అడిగితే లేదన్నారు. దాతలు ముందుకు వస్తే క్రీడా ప్రాంగణాలు నిర్మిస్తాం.

– కృపేష్, ఎంపీపీ, ఇబ్రహీంపట్నం

దాతలు సహకరించాలి



గ్రామంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటకు దాతలు ముందుకు వచ్చి స్థలం కేటాయించాలి. స్థల సమస్య కారణంగా పనులు చేపట్టలేదు. ఏడాది సమయం వృథా అయ్యింది. అధికారులు మాత్రం మాపై ఒత్తిడి చేస్తున్నారు. కానీ భూమి లేక పనులు చేయలేక పోతున్నాం. అధికారులు స్థలం చూపితే వెంటనే పనులు ప్రారంభిస్తాం. మా వంతుగా దాతల సహకారానికి ప్రయత్నిస్తున్నాం.

– హంసమ్మ, సర్పంచ్, కప్పపహాడ్

ముంచుకొస్తున్న ముంపు ముప్పు

పూర్తికాని వరద కాలువ నిర్మాణ పనులు

- శారదానగర్ కాలనీ సమీపంలో నిలిచిన పైప్‌లైన్ పనులు
- స్థలం ఇచ్చేందుకు సహకరించని యజమానులు



చివరి దశలో ఆగిపోయిన వరద కాలువ

వనస్థలిపురం: వర్షాకాలం ముంచుకొస్తోంది.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా వరదనీటి కాలువల పరిస్థితి ఉంది. పలు కాలనీల్లో వరదనీటి కాలువలు పూడికతీతకు నోచుకోక, వరదనీరు దిగువకు వెళ్లడానికి సరైన అవుట్‌లెట్ నిర్మాణాలు జరుగక పూర్వంలాగే ఉన్నాయి. దీంతో రాబోయే వర్షాకాలంలో వరద, మురుగు నీరు వెళ్లడానికి సరైన వ్యవస్థ లేక తమ కాలనీలు ఎక్కడ ముంపు బారిన పడతాయోనని పలు కాలనీల ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

- హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని శారదానగర్, ఫేజ్–3లోని మోహినీ ఎన్‌క్లేవ్ కాలనీలు వనస్థలిపురం, తదితర ఎగువన ఉన్న కాలనీల నుంచి వచ్చే వరద నీటితో ఏటా ముంపు బారిన పడుతున్నాయి.
- దీని నివారణకు శారదానగర్ నుంచి నర్సింహారావునగర్ కాలనీ పక్కగా హయత్‌నగర్ కుమ్మరి కుంట చెరువులో వరదనీరు కలిసేలా గతంలోనే ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వరదనీటి కాలువ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.
- శంకుస్థాపన చేసి ఏడాది అవుతోంది. ఎగువన, దిగువన పనులు పూర్తయినా శారదానగర్ సమీపంలో ఉన్న భూ యజమానులు తమ భూమిలో నుంచి అండర్‌గ్రౌండ్ పైప్‌లైన్ వేయడానికి సహకరించక పోవడంతో వరద కాలువ పనులు అలాగే నిలిచిపోయాయి.

టీడీఆర్ ఇచ్చినా ససేమిరా...

శారదానగర్ సమీపంలో ఉన్న భూమికి సంబంధించి ఓ బీజేపీ నాయకుడు తన భూమిలో నుంచి పైప్‌లైన్ వేయడానికి సహకరించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు వారితో చర్చించి వారు కోరుకున్న విధంగా టీడీఆర్ (ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ రైట్స్) మంజూరు చేయడానికి అంగీకరించినా సదరు నాయకుడు సంబంధిత పత్రాలను అందజేయకపోవడంతో పనులు పురోగతి సాధించలేక పోయాయి.

- ఇదిలా ఉండగా, శారదానగర్, మోహినీ ఎన్‌క్లేవ్ పరిసర ప్రాంతాలలో బహుళ అంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. వరద, మురుగు నీరు వెళ్లడానికి సరైన వ్యవస్థ లేని పరిస్థితుల్లో టౌన్ ప్లానింగ్ అధికారులు భవనాల నిర్మాణాలకు ఎలా అనుమతులు ఇస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



శారదానగర్ కాలనీ దిగువన వరద కాలువ నిర్మించాల్సిన స్థలం

వరద కాలువ పూర్తికి చర్యలు తీసుకోవాలి



వర్షాకాలంలో శారదానగర్, మోహినీ ఎన్‌క్లేవ్ చాలా ఏళ్లుగా వరద ముంపునకు గురవుతున్నాయి. వరద కాలువ నిర్మాణం పనులు చాలా వరకు పూర్తయినా శారదానగర్ దిగువన ఉన్న స్థలంలో సంబంధిత యజమానులు సహకరించక పోవడంతో పనులు నిలచిపోయాయి. వర్షాకాలం సమీపిస్తున్నందున ఈ విషయంలో ఎమ్మెల్యే, కార్పొరేటర్, జీహెచ్ఎంసీ అధికారులు చొరవ తీసుకుని వరద కాలువ నిర్మాణం పూర్తయ్యేలా చూడాలి. కాలనీలను వరదముంపు నుంచి కాపాడాలి.

– నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి, శారదానగర్

ఆణిముత్యాలు



అభినవ్‌రెడ్డి(1,481)



సంతోష్‌రెడ్డి(3,549)

తలకొండపల్లి: రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన ఎంసెట్ ఫలితాల్లో తలకొండపల్లి మండలానికి చెందిన విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు. వెంకటాపూర్‌కు చెందిన బుసిరెడ్డి రఘుమారెడ్డి కుమారుడు అభినవ్‌రెడ్డి ఎంసెట్‌లో 1481వ ర్యాంక్ సాధించారు. ప్రతి రోజూ 8నుంచి 10గంటలు చదివినట్లు తెలిపాడు. భవిష్యత్తులో ఇంజనీరింగ్ చేసి ప్రజలకు సేవ చేస్తానని తెలిపారు. చుక్కాపూర్‌కు చెందిన జక్కు వెంకట్‌రెడ్డి కుమారుడు సంతోష్‌రెడ్డి ఎంసెట్‌లో 3549 ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్‌లో సివిల్స్‌పై దృష్టి సారించి ఐఏఎస్ లేదా ఐపీఎస్ సాధించి ప్రజాసేవ చేయాలనేదే నా సంకల్పమని తెలిపారు.

ఇంటర్‌లో ఉచిత ప్రవేశం

ఇబ్రహీంపట్నం: పదో తరగతి ఫలితాల్లో (ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు) 7 జీపీఏ సాధించిన విద్యార్థులకు ఇబ్రహీంపట్నంలోని శ్రీ వివేకానంద జూనియర్ కళాశాలలో ఉచిత ప్రవేశం పొందవచ్చునని ఆ కళాశాల కరస్పాండెంట్ ఎం రమేష్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో, గురుకులాల్లో, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో, కేజీబీవీలో 10లో 7 జీపీఏకి పైగా మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వికలాంగుల విద్యార్థులకు డీఆర్‌డీఏ ద్వారా 2023–24 విద్యాసంవత్సరానికి ఇంటర్‌లో ఉచిత ప్రవేశాలు పొందవచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పార్కుల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ



బోరు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న పార్కులను అన్ని విధాల అభివృద్ధి చేస్తామని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని దత్తానగర్ కాలనీలోని పార్కు అభివృద్ధిలో భాగంగా బోరు వేసే పనులను కార్పొరేటర్ సుజాతానాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఉన్న పార్కుల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ముందు చూపుతో నిధులను మంజూరు చేయించి పనులు చేయిస్తున్నారన్నారు. దత్తానగర్ కాలనీలో ఏర్పాటు చేసే పార్కు పనులకు హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ వారిచే ఎమ్మెల్యే రూ. 85 లక్షలు మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో ఏఈ జీవన్‌రెడ్డి, దత్తానగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు గోషాల్, అభిషేక్, కనకదుర్గ, ఎల్లయ్య, బీఆర్‌ఎస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పద్మిని, ఆదిలక్ష్మి, రోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.